# కన్నీళ్ళొచ్చేయి

ముప్పై చీకటి సంవత్సరాల
వెనక
మల్లెల మేడ
వెన్నెల గదిలో
ఇంద్ర ధనసు
మంచు తెరలలో
సితారు జాజుల
సన్న జల్లులో
పూర్తి మొగాడూ.
నిండైన మనిషిగా
లతనూ,
బంగారు కొమ్మ కొసని
పూసిన ఆణి ముత్యంలా
విశాలాక్షీ
ఉన్నప్పుడు

"యీ పువ్వుల పూజలు ఎన్నాళ్లో"
"యీ రంగుల పాటలు ఎన్నాళ్ళో"
అన్న శంకల మొసళ్ళు
తల ఎత్తక ముందే
పాటలు తెగి
పూజలు మండి
ముత్యాల ముగ్గులు
మట్టి పాలై
నాన్న నెత్తుకు పోయేక
అప్పుల నక్కలు ఆరేకరాలూ
చీక్కుపోగా
మిగిలిన
అతను, విశాలాక్షీ
ఎండ కాల్చిన
వెన్నెల ముత్యాల్ని
గుడ్డి పూసలుగా
చూసుకొని
పుచ్చిన కోరికల్నీ
చావని ఆశల్నీ
పాత పోపుల డబ్బాల
కెత్తుకొని
పట్నం కొట్టుకుపోతూంటే
"నన్ను పెళ్ళాడినందుకు..."

అనడిగే లోగానే
చెంపని పూసిన రోజా
నతని నోటి కడంపెట్టి
'మీతో నరకం స్వర్గతుల్యం'
అన్న హామీ యిచ్చి
'కష్టాలు కలకాలం వుండవ్'
అన్న ఆశ
ఆమె రగిల్చినప్పుడు కూడా
అతనికి
దుఃఖం వచ్చింది
కాని
కన్నీ ౣ రాలేదు.

♦ ♦ ♦

అసలు కవిత్వం
అరటావు అణాకి
మనిషి మాంసం
ఆడదానెత్తు ఆరణాలకీ
అద్దెకు దొరికే రోజుల్లో
అతని నౌకరీ
పుల్లలేని
పాత గొడుగనీ
వాళ్ళయిల్లు గృహం కాదనే
పాత చింకి కొంపనీ

వాళ్ళ బతుకులు జీవితాలు
కావనీ
చైతన్యంవున్న చావులనీ
వాళ్ళు దేవుడు పుట్టించిన
మనుషులు కారని
పిశాచాల యాగంలో
సమిధలనీ
వాళ్ళ బండెప్పుడూ ఓడవదనీ
వాళ్ళ కావడి
రెండు కుండల్నిండా
కష్టాలేననీ
తెలియక
ఆమె అన్నమాటలు
రెక్కల తేళ్లై
అతని మనసు కుట్టినా
శరత్తు ముందుండని
యీ ముష్పై ముళ్ళ
శిఖరాల్లో
ఆశలు కాలి
అగ్గిలు ఆరి
వెలిసిన చీర పువ్వులా ఆమె,
పగిలిన పాత చెప్పులా అతనూ
ఐనా

30)

అతనికి దుఃఖం వచ్చింది
కాని
కన్నీ ౹రా లేదు.

*　　*　　*

ఎదమీద కుంపట్లా
　　ఎదిగిన
పాతికేళ్ళ శకుంతలకి
పెళ్ళీడు దాటిపోయిందని
ఆమెకే తెలిసిపోయినా
భరించక చేసేదిలేక
"యీనిప్పులబాట ఎన్నాళ్ళు"
"యీ రేపు లేని చీకటి ఎన్నాళ్లు"
　　ప్రభూ?
　　అన్న
అతనిదీ, విశాలాక్షిదీ
పలవరింతల ప్రార్థన
　　ప్రభు
వ్వినకపోతే
"ఇదా! నీ యినుప శాసనం?
నీ కంచుకాలు మామీదా?"
అనడగలేక
సరెండరై పోయినప్పుడు

కూడా
అతనికి
దుఃఖం వచ్చింది
కాని కన్నీ ర్రాలేదు

* * *

మాసిన గోడలుఇంకామాసినట్లూ
ఉన్న కొద్ది పెంకులూ లేనట్లూ
ఉండే
తన కుక్కిగది ఒకటికీ
కట్టాల్సిన ఆర్నెల్లద్దే
తండ్రెంత చెప్పినా
అడగని
కొండ్రాలావెందు కడగడో
అతనిక్, శకుంతలకీ
తెలిసిపోయినా
అతనికి
దుఃఖం వచ్చింది
కాని
కన్నీ ర్రాలేదు

♦ ♦ ♦

ఆ మధ్య
ఖరీదైన కొత్త సిగరెట్పెట్టెలా
కొండల్రా వొచ్చి

సైకిలు గంట
ఇనప గజ్జెలా
మోగిస్తూ
శకుంతలని
విసిగిస్తుంటే
ఆమె జాకెట్టు
ఎక్కడ చిరక్కూడదో
అక్కడ చిరిగి
పాతికేళ్ళ యవ్వనం
యిరవై ఐదేళ్ళ దుఃఖంగా
పొంగినప్పుడు
మటం విప్పి ముందుకు సాగే
మచ్చల పాములా
కొండ్రావు చూపు కాటుకి
మానం చచ్చి
ప్రాణం మిగిలి
అతనూ, శకుంతలా
ఎంత ప్రార్థించినా
ఎంత అర్థించినా
భూదేవి
సవితి బిడ్డలు చేసి
ఒడి యివ్వక
'కొండ్రా వ్వైధవ'

అని తిట్టే
ఆర్నెల్ల
అరత
అద్దె
అతన్నికి లేకపోయినప్పుడు కూడా
అతనికి
దుఃఖం వచ్చింది
కాని
కన్నీ్ళ్రు రాలేదు

• • •

"దీన్ని వీడు లేవదీసుకుపోతే"
"యీా పిల్లలు పిడుగుపడి ఛస్తే"
అన్న పాడాలోచనలు
పాములై మనసుని కుట్టి
గ్రరళం కళ్ళకి దిగి
ప్రేమ ద్వేషమై
ఆశ కి ఆవేశమై
తను తన పిల్లల్నే ఆదరించలేడని
తెలిసిన
శకుంతల
చీకట్లో ఒంటి నక్షత్రంలా
అతనింట్లో వున్నప్పుడు పెరట్లో

గజగజలాడినా
తర్వాతది
ఓణీల్లేవని
బడి మానేసి
పరికిణీలు కూడా
చాలవని తెలుసుకున్నా
తన బుసకి
కాటుకన్నా విషముందని
తెలియక, ఎదురుపడి
తన ఊపిరి శగలో
మాడుతూ వున్నా
అతనికి
దుఃఖం వచ్చింది
కాని
కన్నీ ౹్రాలేదు.

. . .

మొన్న
'నాన్నా పెన్సిలు...'
అని ఆఖరివా డడగ్గబోతే
'పార్కరు పెన్నొద్దురా
......కొడకా'
అని అతను విసిరిన

తిట్టు
విశాలాక్షి ఎదలో పేలి
దుఃఖం
చీర చెంగు బిగించిన
నోట్లోంచి రాలేక
కళ్ళల్లో నీరై
కారి
తనని
కాల్చినా
అతనికి
దుఃఖం వచ్చింది
కాని
కన్నీ(రాలేదు

• • •

దగ్గలేని విశాల
ఎండు గుండెలమీద
మీసాలు కలిసిన
జబ్బు పురుగులా
స్టెతస్కోపు పాకితేనే చూడలేని
తనని
మిషన్లూ, మందులూ
పన్చెయ్యని
ఎన్. జి. ఒ. క్లినిక్ తాలూకు

వచ్చేసినట్టు నటించే
డాక్టరు
P. A. view of chest
X—Ray తీయించమంటే
తనదగ్గర ఎప్పుడూ వుండని
పదిహేన్రూపాయలూ
ఎప్పుడేనా వుంటే
విశాల ఎందు గుండెల్లో
ఏ జబ్బులేదో తెలుసుకోందుకి
X—Ray తీయించాలనుకొని
"ఎన్నాళ్ళీ రంగుల్లేని బతుకు?"
నరనరాన్నీ పీకి
రక్తంలేని మాంసాన్ని
మాంసం లేని ఎముకల్ని
నమిలి నమిలి
చంపక
ఒక్కవేటుతో
మమ్మల్నందర్నీ
రాల్చేయ్
స్వామీ!
నేను విన్లేను
విశాలదగ్గ
అన్న అతని

ప్రార్థన
యముడూ, దేవుడూ.
ఒక్కలాగే యిగ్నోర్ చేసినా
అతనికి
దుఃఖం వచ్చింది
కాని
కన్నీళ్ళు రాలేదు.

◆ ◆ ◆

మూణ్ణాల్ల క్రిందట
కాజల్ పెట్టిన
కలువ కన్నులా
తెల్లంచు నల్లచీర
కట్టుకొచ్చిన
కొండ్రావు చెల్లెల్ని
"ఖరీదెంత?"
అనడగ్గకూడదనుకునే
తల్లీ కూతుళ్ళిద్దరూ
వంతపాడి
"ముప్ఫయ్యా!" అన్న నిరాశ
"ముప్ఫైయ్యంటే ఎంత బావుణ్ణు?"
అని విశాలాక్షి బైటపెట్టని
విచారం
రెండు గుండెల్నీ

నింపి
ఆ చీర
కాలం కొండచిలువ మ్రింగిన
ఎన్ని మధురానుభూతుల్ని
బైటకు తీసి
చెరిగిన విశాలాక్షి
నవ్వులు సరిదిద్దగలదో
అతనూహించుకున్నప్పుడు
అతని గుండెల్లో
నిప్పుల కవ్వం చిలికినట్లయినా
కూడా
అతనికి
దుఃఖం వచ్చింది
కాని
కన్నీ రాలేదు.

♦ ♦ ♦

ఆరాత్రి
"కార్లొద్దు, కనకంవద్దు
మణులొద్దు, మాన్యాలొద్దు
సిరులొద్దు, సింగారాలొద్దు
జన్మలో
ఒక్కటంటే ఒక్కటి
తెల్లచీర నల్లంచుది
అదైనా నూర్ది

ఒక్క చీర
కానేశకి ప్రసాదించు
స్వామీ
అని
మనిషి కాదన్లేని
ప్రార్థన
అతను దేవుడ్ని
చేసుంటే
చంద్రుళ్ళేని వెన్నెల్లా
చల్లగా
తామరలూ, కలువలూ కలిపి
కట్టినట్టు నిండుగా
విశాలాక్షి చెంత చేరి
"మణీ!"
అన్నప్పుడు
ఎప్పుడో మధురస్వప్నంలో
ఎవరో తీయగా పాడిన పాట
మళ్ళీ విన్నట్టయి
చెదపట్టిన స్మృతుల పుస్తకంలో
ఒకపేజీ వెక్కిరించినట్టు
ఆగి
పెళ్ళైన కొత్తల్లో
తను ఎక్కువగా కోరినప్పుడు
ఆమె తననలాగే పిలిచేదని

గుర్తుకి వచ్చి,
"మాసక చీకట్లో మణి అని
భ్రమించి
ముట్టుకుంటే
పామై నీ చేతికి
చుట్టుకున్నానా?"
అన్నాలోచనొచ్చినప్పుడు
కూడా
అతనికి
దుఃఖంవచ్చింది
కాని
కన్నీళ్ళు రాలేదు

• • •

ఆ కాళ రాత్రే
"ఈ వేళ నీ పుట్టిన్రోజు
ఏమివ్వగలను
ఇది తప్ప"
అని ఆమె
ముద్దుతో
తన నుదురుకాల్చి
బైట
ఎదమీది కుంపటీ
వోణీల్లేని శారదా

లెక్కల్రాని కొడుకులూ
వున్నారని
పేనని తాడులా
విడివెళ్ళిపోతే
బెడ్ లైటు ఎర్ర చీకటి
తన మనసుని
చుట్టి చుట్టి చంపేసినప్పుడూ
"విశాల దగ్గుతూనే వుంటుంది
పెద్దపిల్లకి పెళ్ళికాకుండానే వుంటుంది
వోణీల్లేని శారదకి పరికిణీలు చిరుగుతూనే
వుంటాయి
తర్వాత వాళ్ళకి లెక్కల్రాకుండానే
వుంటాయి
తెల్లచీర తను కొన్లేకుండానే వుంటాడు"
అన్న ఆలోచనలు
గుండెని కోస్తూవుంటే
"యీ కతుల పర్వతం
నే నెక్కలేను
యీ విషసముద్రం
నే నీదలేను
యీ నిప్పులదారి
నే నడవలేను"
మాకు, చావు

నిండుగా జీవిత ధ్యేయంలా
చల్లగా తీరిన కోరికలా
వుంటుంది
మమ్మల్నీ
ఈ తెరబోనులో
నొక్కడం
నీ లీలా స్వామీ"
అని ప్రార్థించినప్పుడు
కూడా
అతనికి
దుఃఖం వచ్చింది
కాని
కన్నీ రాలేదు.

. . .

ఆ మర్నాడు
మొన్న కాలని శవంలా
రేపటి జబ్బుకిముందొచ్చే మూలు
గులా
కాకుండా
అతను
ఒక భర్తగా
ఒక తండ్రిగా
ఒక మొగాడుగా
నిద్రలేచి
హాయిాలోగా ఒక్క మంచిపని

చేస్తానన్న నమ్మకంతో
ఆఫీసులో
ఆగని బుసలాటి ఫేను చప్పుళ్ళో
కాఫీకి అరిచే పేగులు
తనని కావనుకొని
కాల్చే కొద్ది చౌకబారు సిగరెట్లూ
యింకా కొద్ది చేసి
 రథసప్తమినాడొచ్చే
 విశాల పుట్టిన్రోజుకీ
 కొండ్రలావు చెల్లెలు చీరలాంటిది
పట్నంలో
'ఇంగ్లీషు డ్రెస్ హౌస్' లో
'మూన్ డ్రీమ్ శారీ'
ఖరీదు 'ముప్పయ్యే'
కొండానికి
మూణ్నెల్లలో
మూడు పదులు మిగిల్చినప్పుడు
 అనిర్వాచనీయమైన సంతృప్తితో
 కూడా
 అతనికి
 దుఃఖం వచ్చింది
 కాని
 కన్నీ్ళ్ళు రాలేదు

o o o

పుట్టిన్రోజు ముందునాడు
పనిమీద పట్నం పంపించిన
ఆఫీసర్ని ఆశీర్వదిస్తూ
అడవి మృగాల మెరిసే కళ్ళలా
వెలిగే పట్నపు లైట్ల
మధ్య చీకట్లో
'ఇంగ్లీషు డ్రెస్ హౌస్' చేరుకొని
షో కేస్లో
తెల్లదొర మట్టిశవం బొమ్మ
శాపం చూపు తగలకుండా
షాపులో కెళ్ళి
అరవ అతివ ముక్కుపుడకలో
మూరెడు ట్యూబులైటూ
గుచ్చుకోకుండా
వంగి, వడిగి
దీనంగా, దైన్యంగా
హేయంగా
"తెల్లదొరలు మళ్ళీ వచ్చేవరకూ
ఈ తెల్లముఖాలకి అమ్మడం
తన శాపభాగంగా అంగీకరించిన
సింధీ షాపువాడి
నవ్వని నవ్వుల విషం
తట్టుకొని
అతను వేసిన చీరల మేట్లోంచి

తనక్కావలసిన
తెల్లచీర కొనుక్కొని
బైటపడి
సముద్ర ఒడ్డున
కూర్చున్నప్పుడూ,
నల్ల మేఘాల్లో మెదిలే చంద్రుడు
అప్సరస జుట్టుముడిలో
వెండిపువ్వులా మెరిసి
తనమీద
ముత్యాలవాన కురిపించినప్పుడూ,
ప్రియుడికోసం పరచిన పైటలా
సముద్రం తెల్ల కెరటాలని పరచినప్పుడూ
"రేపు నాక్కూడా......
అన్న ఆశ విరిసినప్పుడూ,"
ఆఖరి బస్సులో
తిండి తినని నిండు కడుపుతో
విరిగిన కల అతికిన సంతోషంతో,
తనకి
దొరికిన దంతబొమ్మకి
ఉల్లిపొర కాగితం
కొనగలిగినందుకూ
నిజం దేవుడి పాదాలదగ్గర
నూనెదీపం వెలిగించగలిగినందుకూ,
ఆత్మ విశ్వాసంతో

దేశం మంచిదనీ
దేవుడు కరుణామయుడనీ
భక్తి విశ్వాసాలతో,
రేపొద్దున స్నానం చేశేక
విశాలని సర్ప్రైజు చెయ్యవలసిన
చీర
గోడమేకుని జూట్ హేండుబేగులో
వేలాడుతూండడం
చూస్తూ పడుకున్నప్పుడు కూడా
నిండు కోరిక
తీరిన ఆనందంతో
అతనికి
దుఃఖం వచ్చింది
కాని
కన్నీ ్రరాలేదు

. . .

ఆ మర్నా డుదయం
విశాల పెరట్లో స్నానం
చేస్తున్నప్పుడు
అతను
కాలెండరు దేవుడి
కాగితపు నవ్వులో
'ఇంగ్లీషు డ్రెస్ హౌస్'
కవరు చింపగానే

హృదయం చిరిగినట్టయి
దాన్లోంచి పామొచ్చినట్టయి
అతను విసిరేస్తే
కుక్కి మంచంమీ
పొరలు విప్పుకొని
పసుపులో ముంచిన
కళ్ళ కలక గుడ్డలా
కన్నెకన్నుకి కాటుక చెరిగి
కామెర పట్టినట్టు
అసహ్యంగా
పడుంది అతనుముందురాత్రి
పాపు ట్యూబులైట్లు
కళ్ళల్లో గుచ్చుకొని
రంగుల భేదం
తెలియక
కొన్న
పచ్చచీర

• • •

ఆ చీర కింద
పునిస్త్రీ శవం పడుకున్నట్లయి
అతనికి
కన్నీళ్ళొచ్చేయి.

—o—